www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 24 మార్చి 2025

5

చిత్తూరు



వాయిదా పడ్డ ప్రజాసమస్యల పరిష్కార వేదిక



ప్రజాశక్తి- కుప్పం టౌన్: 24వ తేదీ సోమవారం జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక వాయిదా వేస్తున్నట్లు కడా పీడీ వికాస్ మరమ్మత్ ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గ కేంద్రంలో సైతం కడా ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించాలని అయితే మార్చి 24వ తేదీన జరగాల్సిన ఈకార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నామని, కనుక నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

పుష్పవిలాపం..



- భారీగా పతనమైన పూల ధరలు
- తోటల్లోనే వదిలేస్తున్న వైనం..
- అప్పులపాలవుతున్న రైతన్నలు



తోటలలో కోయకుండా వదిలిన బంతిపూలు

ప్రజాశక్తి- వి కోట

గడిచిన కొద్ది రోజులుగా ప్రజలకు చుక్కలు చూపించిన పూల ధరలు నేడు భారీగా పతనమవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మండల పరిధిలో ఉద్యాన పంటల సాగుకు అనువైన వాతావరణం ఉండడంతో రైతులు పూలు, కూరగాయలు పండిచటం వైపు మొగ్గు చూపుతున్నారు. జనవరి నెలలో ఆశాజనకంగా ఉన్న పూల ధరలను చూసి రైతులు పెద్ద ఎత్తున బంతి, చామంతి పంటను సాగు చేశారు. స్థానిక పూలమార్కెట్లో పూల ధరలు పతనం కావడం, కొనుగోలుదారులు పూలను తక్కువగా కొనడంతో ధర తగ్గిపోయింది. దీనికి తోడు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జనవరిలో సంక్రాంతి సందర్భంగా కిలో బంతిపూల రూ.70 నుంచి 80ల వరకు ధరలు పలికాయి. ఫిబ్రవరిలో శివరాత్రి సందర్భంగా రూ.30 నుంచి 50ల వరకు ధరలు పలికాయి. మార్చిలో పండగలు లేకపోవడంతో ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. మేలు రకం బంతిపూలు కిలో రూ.10 నుంచి 13లు పలుకగా రెండోరకం రూ.10లోపే అమ్ముడుపోయాయి. ఇక మూడు, నాలుగో రకం పూలు వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో రైతులు పూల తోటలోనే అలాగే వదిలేస్తున్నారు.. ఉగాది నాటికైనా పూల ధరలు పెరుగుతాయో.. లేదో.. అన్న అయోమంలో ఉన్నారు రైతులు..

కుప్పం నియోజకవర్గంలో బంతి, చామంతి పూలను స్థానిక మార్కెట్లో తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తుండడంతో వీకోట మార్కెట్‌కు అష్టకష్టాలు పడి తరలిస్తుంటారు రైతులు. పెళ్లిళ్లు, శుభకార్యాలు జరుగుతున్న ప్రస్తుత కాలంలో కూడా పూలకు ధరలు లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు చేసిన పూలను మార్కెట్లో నిల్వ ఉంచలేని పరిస్థితులలో తక్కువ ధరలకే పూలను విక్రయిస్తుంటారు. ఇదే అదనుగా కొందరు దళారులు రైతుల నుండి కొనుగోలు చేసిన పూలను విజయవాడ, రాజమండ్రి, హైదరాబాద్, తిరుపతితో పాటు తమిళనాడు రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాలకు తరలిస్తుంటారు. అక్కడ పూలు అమ్ముడుపోలేదని రైతులకు ఇవ్వకపోవడంతో పంటపై పెట్టిన పెట్టుబడులు, కూలీలు, రవాణా, సంచులు తదితర వ్యయాలు అంతా రైతులే భరిస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్న సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి.

వెలుగుల చామంతి.. పండించే రైతు దీనస్థితి..

సీజన్‌తో సంబంధం లేకుండా జాతీయ, అంతర్జాతీయ చామంతి రకాలతో ఏ కాలంలోనైనా సాగును సులభంగా పండించి మండల రైతులు ఆదర్శంగా నిలిచారు. విద్యుత్ దీపాల కాంతులతో పాటు రైతులు కష్టాలతో తోటలను సాగు చేస్తున్నారు. ఇటీవల కాలంలో పూలు కోసే కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో రైతులు తమ పొలాలలోనే రోటరీ యంత్రాలతో పంటలను దున్నివేస్తున్నారు. పూల పంట ఉన్న కొంతమంది రైతులు ఉగాది పండుగకైనా మంచి ధర రాకపోదా.. తమ కష్టం తీరదా అని ఆశాభావంతో పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.



విద్యుత్ దీపకాంతులతో ప్రకాశిస్తున్న చామంతి తోటలు

మార్కెట్లపై అధికారులకు నియంత్రణ ఉండాలి..

- చిన్నయ్య రాజు, రైతు



రైతులు పండించి వ్యవసాయ మార్కెట్లకు తరలించే పూలపై ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టి గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం పూల మొక్కలను, ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై రైతులకు అందించాలి. గ్రామీణ ప్రాంతాల నుండి రైతులు పండించే పంటలను మార్కెట్‌కు తరలించేందుకు అవసరమైన రవాణా సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరంపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

ఉపాధి బిల్లుల కోసం నిరీక్షణ

- కూలీలకు డబ్బులు ఇవ్వని సర్కారు...
- జిల్లాలో 33.93 కోట్లు మేర బకాయి
- 70 రోజులుగా వేతనాలు అందక ఇక్కట్లు..
- 40 వేల మంది ఎదురుచూపులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి):

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ చట్టంకు 2025 జనవరి 9వ తేదీ నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం ఉపాధి పనులు చేపట్టిన 15 రోజులు ఒక్కసారి ఉపాధి బిల్లులు చెల్లించాలని ఉపాధి హామీ చట్టం చెబుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నిధులు విడుదలలో జాప్యం జరుగుతున్నాయి. నిధులు విడుదల కాకపోవడంతో ఉపాధి కూలీలు చేసిన పనుల బిల్లుల కోసం నెలలు తరబడి వేసి చూడాల్సిన పరిస్థితి.

గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు 70 రోజులుగా వేతనాలు చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ ఏడాది జనవరి 9 తర్వాత పనులు చేసిన కూలీలకు ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదు. 70 రోజులపాటు చేసిన పనులకు సంబంధించి దాదాపు చిత్తూరు జిల్లాలో 31 మండలాల్లో రూ.33.93 కోట్లను కూలీలకు చెల్లించాల్సి ఉందని అధికారులు లెక్కలు చెబుతున్నారు. సుమారు 40వేల మంది ఉపాధి కూలీలు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని రోజుల్లో పేదలు ఉపాధి హామీ పనులపైనే ఆధారపడుతుంటారు. వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోవడంతో నిరుపేద కూలీలు ఉపాధి పనులు చేసుకుంటూ కుటుంబం పోషించుకుంటున్నారు. అటువంటిది ఇక్కడా వేతనాలు బకాయిలు పడ్డటంతో జీవనం సాగించడం ఎలా అంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలలుగా ఎదురుచూపులు


- లత, కొత్తూరు ఆదిఆంధ్రవాడ,యాదమరి



ఓటివారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కింద మామిడి చెట్లకు కందకాలు పనులు జనవరి నెలలో ఉపాధి పనులు చేసాం. పనులు చేసి రెండు నెలలు అయ్యింది ఇంతవరకు కూలీ డబ్బులు మా అకౌంట్లో జమ కాలేదు. డబ్బులు సకాలంలో రాకపోవడంతో కుటుంబ జీవనానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

ఆరు వారాలు ఉపాధి పనులు చేసాం..

- జ్ఞానశేఖర్, కోనాపల్లి గ్రామం, యాదమరి



ఉపాధి హామీ పనులు ఆరు వారాలపాటు మా గ్రామంలో చేసాం. సుమారు 10 వేల రూపాయలు మాకు రావాల్సి ఉంది. 70 రోజులుగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నాం. ఆఫీసులో అడిగితే ఈరోజు పడతాయి, రేపు పడతాయని పొంతలేని సమాధానం చెబుతున్నారు. చేసిన పనులకు బిల్లులు సకాలంలో రాకపోవడంతో మహిళా సంఘంలో లోన్లు సకాలంలో కట్టలేకపోతున్నాం.

రెండు రోజులలో ఖాతాలకు నిధులు జమ అవుతాయి

- రవికుమార్, ఉపాధి హామీ చిత్తూరు జిల్లా సంచాలకులు



జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు బకాయిలు రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం విడుదల చేస్తుంది. నిధులు విడుదలైన వెంటనే వారి వ్యక్తిగత ఖాతాల్లో జమవుతాయి. ఉపాధి కూలీలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఉపాధి పనులు చేసిన కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.



పేదపిల్లలపై ఇంత నిర్లక్ష్యమా..?



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తూ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాల్లో ఉంటున్న బాలికల పట్ల సంబంధిత అధికారులు నిర్లక్ష్యల ధోరణితో వ్యవహరిస్తున్నారు. బాలికలు వసతి గృహం నుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే జాతీయ రహదారి గుండా దాదాపు ఒక కిలోమీటర్ దూరంలో ఉంది. బాలికలు పర్యవేక్షణ లేక వెళుతుంటే ఆకతాయిలు వెకిలి చేష్టలతోపాటు ద్విచక్ర వాహనదారులతో ఇక్కట్లు పడుతూ పాఠశాల వెళుతున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరు.. ఇకనైనా బాలికల వసతి గృహ సిబ్బంది బాలికల పట్ల శ్రద్ధకనపరిచి బాలికల అభ్యున్నతికి సహకరించాలని దీనిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన సికెబి క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న సీకె బాబు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 20 రోజుల పాటు పివికెఎన్ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించిన సికెబి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేతలకు మాజీ ఎంఎల్ఏ సికె.బాబు, కెల్విన్ బ్లాక్ బాయ్స్ టీంకు ట్రోఫీతో పాటు నగదుని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన గలాటా బాయ్స్ టీం కి ట్రోఫీతో పాటు నగదుని అందజేశారు. మొదటి నగదు బహుమతి విజేతలకు లక్ష రూపాయలు, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.25వేలు అందజేశారు. అనంతరం ఈటోర్నమెంట్ నిర్వాహకులైన హేమంత్, శివ, మాజీ కార్పొరేటర్ మురళీలను ప్రత్యేకంగా అభినందించారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:



ప్రతినెలా చివరి ఆదివారం జైన్ సంఘం నేతృత్వంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి అరవిందో ఐ ఆసుపత్రి వైద్య బృందం 114 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 52 మందిని ఆపరేషన్స్ కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జైన్ సంఘం ప్రతినిధి సుభాష్‌జైన్ మాట్లాడుతూ జైన్ సంఘం నేతృతంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆపరేషన్స్ కోసం ఎంపికైన వారికి ఉచిత రవాణా, భోజనం, వసతి ఏర్పాటు చేసి ఎలాంటి ఖర్చు లేకుండా కంటి ఆపరేషన్స్ నిర్వహించడంతో పాటు కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందిస్తున్నట్లు చెప్పారు.

పటిష్టంగా పిసిపిఎన్‌డిటి చట్టం అమలు

ఇంటర్వ్యూ

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

డాక్టర్ సుధారాణి

జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలో పిసిపిఎన్‌డిటి చట్టం పటిష్టంగా అమలు చేస్తున్నామని, పోలీసు, స్త్రీశిశు సంక్షేమశాఖ ఇతర శాఖల సహకారంతో లింగనిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని, ఎవరైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలైన లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలకు పాల్పడిన వారికి చట్టపరమైన, న్యాయపరమైన శిక్షలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సుధారాణి తెలిపారు. జిల్లాలో పిసిపిఎన్‌డిటి చట్టం అమలును ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలియజేశారు.

ప్రజాశక్తి: జిల్లాలో స్త్రీ, పురుషుల నిష్పత్తి ఎలా ఉంది..?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: జిల్లాలో ప్రతి వెయ్యి మంది మగ శిశువులకు గాను 944 మంది ఆడశిశువులున్నారు. దీన్ని బట్టి ఆడశిశువుల సంఖ్య తగ్గుతున్న విషయం తెలుస్తోంది. ఆడ సంతానాన్ని పిండదశలోనే చిదిమేయడం చట్టరిత్య నేరం. లింగ నిర్ధార్ణ పరీక్షలు చేయడం చట్టరిత్య నేరం.

ప్రజాశక్తి: లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: ఆడ, మగ రేషియో సమానంగా ఉండాలి. జిల్లాలో వెయ్యి మగ శిశువులకు 944 మంది ఆడశిశులున్నారు. ఈ నిష్పతిని దృష్టిలో ఉంచుకొని పిసిపిఎన్‌డిటి చట్టాన్ని పట్టిష్టంగా అమలు చేసేందుకు ఈనెల 21వ తేదీ ఇంటర్ స్టేట్ కోఆర్డినేటర్స్ మీటింగ్ నిర్వహించాం. ఈ మీటింగ్‌లో వెల్లూరు, తిరువల్లూరు, క్రిష్ణగిరి, తిరుపత్తూరు, కోలార్, కుప్పం, నగరి, గుడిపాల ఇంటర్ స్టేట్ సరిహద్దులలోని వైద్యాధికారుల సమావేశం నిర్వహించి ఇతర ప్రాంతాల్లో మన జిల్లాకు చెందిన వారు లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకోకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాం.

ప్రజాశక్తి : స్కానింగ్ సెంటర్లపై ఎలాంటి నిఘా ఉంచుతున్నారు?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: ముఖ్యంగా లింగనిర్ధారణ పరీక్షల కోసం స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో 12 స్కానింగ్ సెంటర్లు నడస్తున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు, స్కానింగ్ సెంటర్లలో ఎట్టి పరిస్థితుల్లో లింగనిర్ధారణకు స్కానింగ్ నిర్వహించరాదని ఆదేశించాం. అలాగే కాకుండా నిర్వహించిన్నట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అలాగే ప్రతి స్కానింగ్ సెంటర్ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆరోగ్యశాఖ అలాగే పోలీసు, విజిలెన్స్ శాఖవారు ప్రతినిత్యం గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు పాల్పడుచున్నవారిపై నిఘా ఉంచుతున్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడుతున్నా, ప్రోత్సహిస్తున్నా, ప్రోద్బలం చేస్తున్నా.. అలాంటి వారి వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయలని కోరుతన్నాం.

ప్రజాశక్తి : లింగ నిర్ధార్ణకు పాల్పడేవారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.....?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: ఎవరైన గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు పాల్పడుతున్నట్లు తెలిసినా, భ్రూణహత్యలకు పాల్పడుతున్నా వారిపై సెక్షన్ 23, 24, 25 క్రింద కేసు నమోదు చేసి జరిమానాలు విధించి, శిక్షలు అమలు చేయడం జరుగుతుంది. మొదటిసారి ఈ చట్ట పరిధిలో చేసిన తప్పుకు (అతిక్రమణకి) 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 10వేలు జరిమానా. రెండవసారి తప్పుకు 5సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.50వేలు జరిమానా విధించడం జరుగుతుంది.



డాక్టర్ సుధారాణి
జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 24వ తేదీ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంట కల్లా తప్పక హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండలస్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

ఆక్రమణకు కాదేదీ.. అనర్హం..

- అక్రమ కట్టడాలకు నెలవు వెంకట్రామయ్య చెరువు
- ఆచరణకు నోచుకోని అధికారుల ఆర్డర్



చెరువు ఆవరణలో అక్రమ కట్టడం అంటూ సగం కూల్చివేసిన నిర్మాణం

ప్రజాశక్తి- కుప్పం రూరల్:

ప్రస్తుతం చెరువును అయినా పర్లేదు ఆక్రమిస్తే పోలా అన్న రీతిలో కొంతమంది వ్యవహరించడం బాధాకరమని పలువురు సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణం ఏదైనా చెరువు నీరు లేక ఎండి ఉంటే చాలు ఆక్రమించి కొందరు చెరువులో గోతులు తవ్వి, అక్రమంగా మట్టితోలు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంతరు దర్జాగా కట్టడాలను కట్టేస్తున్నారు.. ఇంకొందెరోమో.. లేఅవుట్లు వేసి అమ్ముకుంటున్నారు..

ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు చేపడుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలలో భూసమస్యలపై అధికంగా ఫిర్యాదులు రావడం ఎందుకు నిదర్శనం. ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో ప్రధానంగా పట్టణ ప్రాంతాలలో ప్రైవేటు స్థలాలకే కాకుండా, ప్రభుత్వ భూములకు, అందులోనూ చెరువులకు, వాగులకు, వంకలకు, రాజ కాలువలకు రక్షణ కరువైంది. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూముల్లో అనధికార లేఅవుట్లు ఏర్పాటు చేసి సొమ్ము చేసుకుంటే, మరి కొంతమంది ఏకంగా చెరువులను, వాగులను, వంకలను, రాజ కాలువలను సైతం వదలకుండా లేఅవుట్లు ఏర్పాటు చేయడం, చెరువులను ఆక్రమించుకొని నిర్మాణాలను చేపట్టడం వంటివి జరుగుతున్నాయి. ఇలాంటి చర్యలు భవిష్యత్తు తరాలకు ముప్పు తెచ్చి పెడుతుందని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం కూడా ఇందుకు ఏమాత్రం తీసిపోదని స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆక్రమణదారులు నిరూపిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తూనే ఉన్నారు. అయినా అధికారులు మాత్రం తమకేమీ పట్టీపట్టనట్టు పహరిస్తున్నారు. ఏదైనా ఆక్రమణ జరిగినప్పుడు మాత్రం అధికారులు హడావిడి చేసి, ఆపై నిమ్మకునీరెత్తినట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కొందరు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారులు సైతం అధికారుల హడావిడి తగ్గేంతవరకు మిన్నకుండి, అదును కోసం వేచి చూసి నిషేధిత భూములను అందినకాడికి ఆక్రమించుకుని, అక్రమ సంపాదనను పెంచుకోవడం కోసం అమాయక ప్రజలను మోసగిస్తున్నారు. ముఖ్యంగా కుప్పం పట్టణ పరిధిలో అనేక చెరువులు, వాగులు, వంకలు ఆక్రమణకు గురి అవుతూనే ఉన్నాయని, ప్రధానంగా పట్టణ నడిబొడ్డులో ఉన్న వెంకట్రామయ్య చెరువును ఆక్రమించుకొని, నిర్మాణాలు నిర్మించుకున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

అక్రమ కట్టడాలకు నెలవు వెంకట్రామయ్య చెరువు

కుప్పం పట్టణ నడిబొడ్డులోని వెంకటరామయ్య చెరువు అక్రమ కట్టడాలకు నెలలుగా మారింది. పట్టణ అభివృద్ధిలో భాగంగా గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్మించిన ఫ్లై ఓవర్‌కు ఆనుకుని, క్రిష్ణగిరి పలమనేరు అంతర్రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారికి పక్కనే ఉన్న వెంకట్రామయ్య చెరువును కొంతమంది నిర్మాణాలు చేపట్టడం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ నిర్మాణాలు చేపట్టిన వారిలో బడుగు బలహీన వర్గాలకు చెందిన వారి కట్టడాలను కూల్చివేసిన అధికారులు బడా బాబుల కట్టడాల జోలికి మాత్రం వెళ్లే ధైర్యం చేయడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆచరణకు నోచుకోని అధికారుల ఆర్డర్

కుప్పం పట్టణ నడిబొడ్డులో కోట్ల రూపాయలు విలువచేసే వెంకట్రామయ్య చెరువు దురాక్రమణకు గురి అయిందన్న సమాచారాన్ని అందుకున్న అప్పటి మదనపల్లి రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ వెట్రిసెల్వి ఆనాడే ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు స్థానిక ప్రజలు తెలిపారు. అప్పటి రెవెన్యూ, ఇరిగేషన్, మేజర్ గ్రామపంచాయతీ శాఖల స్థానిక అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆనాటి సబ్ కలెక్టర్ వెంకట్రామయ్య చెరువు దురాక్రమనకు గురైనట్టు గుర్తించడం జరిగిందన్నారు. ఈ విషయమై స్పందించిన సబ్‌కలెక్టర్ ఆక్రమణదారుల నుండి చెరువును స్వాధీన పరుచుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు స్థానికులు తెలిపారు. అయినా సుమారు దశాబ్ద కాలం పూర్తి కావస్తున్న నేటికీ అధికారుల ఆదేశాలు ఆచరణకు నోచుకోలేదని, ఇందువల్ల ప్రజాప్రయోజనార్థం ఉపయోగపడవలసిన చెరువు ఆక్రమణలపాలై, ఆక్రమణదారుల సొంత ఆస్తులుగా మిగిలిపోయింది ప్రజలు అంటున్నారు.



గత కొద్ది రోజులకు ముందు చెరువు ఆవరణలో అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ ఫోటో)

ఎయిర్ వెంటిలేటర్‌తో అధిక దిగుబడి

- పట్టు రైతులకు బహుళ ప్రయోజనాలు - పట్టు పురుగుల పెంపకం షెడ్లు, ఫ్యాక్టరీలలో పెరుగుతున్న వినియోగం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: సైన్స్ ఎంతో అభివృద్ధి చెందుతోంది..అధునాతన టెక్నాలజీతో కూడిన వస్తువులు మన జీవితాన్ని మరింత సులభతరంగా మార్చేస్తు న్నాయి. మన చుట్టూ ఉన్న కొన్ని వస్తువులు మనకు తెలియకుండానే ఎంతో ఉపయోగ పడుతున్నాయి. ఇలాంటి వాటిలో స్టీల్ డోమ్ రొటేటింగ్ పరికరం ఒకటి. ఇది పట్టు రైతుల షెడ్లలో, ఫ్యాక్టరీలలో ఎంతో ఉపయోగ పడుతోంది. పంట అధిక దిగుబడికి దోహదపడుతోంది.

మనం రహదారిపై ప్రయాణిస్తున్నప్పుడు గ్రామాలలో పై కప్పులపై గుండ్రంగా తిరుగుతూ కనిపిస్తాయి. పై కప్పుపై గుండ్రంగా ఫ్యాన్‌లా తిరిగే ఈ వస్తువు అలంకారం కోసమో లేక ఫ్యాషన్ కోసమో ఏర్పాటు చేసుకున్నారని అనుకుంటాం.. అలంకార వస్తువు కాదు..దీని పేరు టర్బో వెంటిలేటర్ అని అంటారు. సైన్స్, ఇంజనీర్ కలయికతో దీన్ని రూపొందించారు. ఈ టర్బో వెంటిలేటర్‌కు, ఎయిర్ వెంటి లేటర్, టర్బైమ్స్ వెంటిలేటర్, గ్రూప్స్ ఎక్స్ ట్రాక్టర్ అని పిలుస్తారు. ప్రస్తుతం ఇది పట్టు పురుగుల పెంపకం రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. పెద్దపెద్ద మాల్స్‌లలో, రైల్వేస్టేషన్, ఫ్యాక్టరీలలో ఇవి సాధారణంగా మనకి కనిపిస్తుంటాయి. మండలంలో పట్టు పురుగుల పెంపకం రైతుల షెడ్లు 136 వున్నాయి. మొత్తం 213 మంది రైతులు వున్నారు. వీరు తమ పట్టుపురుగుల పెంపకం షెడ్లలో ఈ వెంటిలేటర్లను ఉపయోగిస్తూ పట్టు పురుగుల పెంపకం రైతులు బహుళ ప్రయోజనాలు పొందుతున్నారు.

ఎయిర్ వెంటిలేటర్‌తో ప్రయోజనం

ఈ వెంటిలేటను ఎక్కువగా ఏర్పాటు చేసుకుంటున్నారు. షెడ్‌లో ఉన్న వేడి గాలిని పైకి పంపి కింద ఫ్రెష్ గాలిని లోపలికి తీసుకుంటుంది. ఈ వేసవిలో లోపల వేడి అధికంగా నిలవ వుంటుంది. తేమను, దుర్వాసనను తొలగిస్తాయి. గాలి ప్రవాహం ద్వారా నేచురల్‌గా చల్లగా ఉండేలా చేస్తాయి . వేడి గాలిని పైకి పంపివేస్తుంది. చల్లటి గాలి దిగువకి వస్తుందనే శాస్త్రీయ సూత్రం ఆధారంగా ఇది పనిచేయడం వల్ల పట్టు గూళ్లలో వున్న పట్టు పురుగులకు తగిన వాతావరణాన్ని ఇది కలిగిస్తుంది. దీనికి కరెంట్ అవసరం లేకుండా దానంతట అది తిరుగుతుంది. వీటిని అమర్చుకోవడం సులభం.. నిర్వహణ తక్కువగా ఉంటుంది. ఇవి పట్టు పురుగులకు అవసరమైన వాతావరణాన్ని కల్పించి రక్షణ ఇస్తాయి.

- రమేష్‌రెడ్డి, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల పట్టు పరిశ్రమ సంవర్ధక శాఖ అధికారి,



ఎయిర్ వెంటిలేటర్ ఉపయోగాల గురించి వివరిస్తున్న దృశ్యం

దిగుబడి బాగుంది..



ఎయిర్ వెంటిలేటర్‌ను పై కప్పుపై బిగించుకోవడం వల్ల, పట్టుపురుగు షెడ్ లోపల చల్లగా వుంది. వేడిగాలి పైకి పోతుంది. పంట దిగుబడి బాగా వస్తుంది. మల్బరీ ఆకు ఎండి పోకుండా వుంది. పట్టు రైతులకు ఎంతో ఉపయోగం. ఖర్చు కూడా తక్కువే..

- గుర్రం ధర్మయ్య, రైతు, గుర్రం వారి కండ్రిగ, వెదురుకుప్పం మండలం.



నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు .. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నర్సింగ్ విద్యార్థులకు క్షయ నివారణ పట్ల అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్ కుమార్ జాయింట్ కలెక్టర్ విద్యాధరి,చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ దగ్గు మళ్ల ప్రసాదరావు, చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ కటారి హేమలత ,చిత్తూరు మేయర్ అముద పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని ఒక సంవత్సర కాలం పాటు క్షయ వ్యాధి లేని 18 పంచాయతీలకు టీబి ముక్త్ పంచాయతీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి అవార్డులను ప్రదానం చేస్తామన్నారు.

క్రైం న్యూస్



గాయపడ్డ వారికి చికిత్స అందిస్తున్న వైద్యులు

లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనం లారీని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం మండలంలోని మొగిలి ఘాట్‌లో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తమిళనాడు తిరువళ్లూరుకు చెందిన మనోజ్, చెన్నైకి చెందిన వేలు ఇద్దరూ ద్విచక్ర వాహనంలో పలమనేరుకు వెళుతుండగా ముందు వెళుతున్న లారీని అధిగమించే ప్రయత్నంలో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టైం స్కేల్ అమలు చేయండి

టిటిడి సొసైటీ ఉద్యోగులు

ప్రజాశక్తి - తిరుపతి :టీటీడీలో వివిధ విభాగాలలో అవసరం మేరకు విద్యా అర్హత కలిగిన వారికి పరీక్షల నిర్వహించి, మెరిట్ లిస్ట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ తమను నియమించుకొన్నారని టిటిడి సొసైటీ ఉద్యోగులు పేర్కొన్నారు. ఈవో ఆదేశాల మేరకు సొసైటీలుగా ఏర్పడి గత 15-20 సంవత్సరాలుగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమకు టైం స్కేల్ వర్తింపజేయాలని, తమకంటే తక్కువ సర్వీస్ ఉన్నవారికి అన్ని సౌకర్యాలు కల్పించారని తమకు అన్యాయం జరుగుతుందని టీటీడీ ఈవో, జేఈవో, పాలకమండలి సభ్యులను, స్థానిక శాసనసభ్యులను కలసి టీటీడీ సొసైటీ ఉద్యోగులు వినతిపత్రాలు సమర్పించారు. 24 వ తేదీన జరగబోయే టీటీడీ బోర్డు సమావేశంలో సొసైటీ ఉద్యోగుల గురించి చర్చించి, టైం స్కేల్ మంజూరు చేయవలసిందిగా టీటీడీ అసోసియేషన్ నాయకులు ఒక ప్రకటనలో కోరారు.

ద్వితీయ భాషగా తెలుగును కొనసాగించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎంబైపీసీ విధానంలో ద్వితీయ భాషగా తెలుగును ఇప్పుడున్న విధంగా కాకుండా ఐచ్ఛికంగా తీసుకురావడం ఎంతో శోచనీయమని తిరుపతి జిల్లా తెలుగు ఉపాధ్యాయ సంఘం ఇంటర్మీడియట్ స్పాట్ వ్యాల్యూషన్ కేంద్రం ఎస్వీ జూనియర్ కళాశాలలో ఆర్ఐఓ ప్రభాకర్ రెడ్డికి ఆదివారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ స్పందిస్తూ ఇంటర్మీడియట్ కమిషనర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల శ్రీమన్నా రాయణ, దుర్గారావు, మీరా సాహెబ్, మునీంద్ర, గంగాధర్, జయ మ్మ, వెంకట్రావు, శిరీష, రమ, ఉమాదేవి, మోహన్, శశికళ, నాగేశ్వర రావు, వాణి, ధనమ్మ, వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఏపీవోల బదిలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం: తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గంలోని 4 మండలాల నరేగా ఏపీఓలను తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు బదిలీలు చేస్తూ డ్వామా సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వడమాలపేటలో ఏపీవోగా పనిచేస్తున్న పి.సునీతను రామచంద్ర పురానికి, ఇక్కడ పనిచేస్తున్న ఏపీవో హంస వేణి వడమాలపేటకు, రేణిగుంటలో పనిచేస్తున్న ఓ జ్యోతిశ్రీని తిరుపతి రూరల్‌కు, తిరుపతి రూరల్‌లో పని చేస్తున్న మమతను పుత్తూరుకు, పుత్తూరులో పనిచేస్తున్న భార్గవిని చంద్రగిరికి, చంద్రగిరిలో పనిచేస్తున్న జ్యోతిని బాలయ్య పల్లికి, బాలయ్యపల్లిలో పనిచేస్తున్న ఆషారాణిని పాకాలకు, పాకాలలో పనిచేస్తున్న కళ్యాణిని తొట్టంబేడు మండలాల ఏపీవోలుగా బదిలీ చేశారు. యర్రావారిపాల్యం, చిన్నగొట్టుగల్లు మండలాల ఏపీఓలను మాత్రం బదిలీలు చేయలేదు. నూతన ఏపీవో లుగా సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించినట్లు సమాచారం.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై కార్యక్రమం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయు స్టూడెంట్ వెల్ఫేర్ కల్చరల్ అఫైర్స్, సెట్విన్ కోఆర్డినేటర్స్ డాక్టరు పత్తిపాటి వివేక్, మోహన్ కుమార్ ఆధ్వర్యంలో నేడు "వ్యక్తిత్వ వికాసం" కార్యక్రమం వర్సిటీలోనూ, వర్సిటీ అనుబంధ కాలేజీ శ్రీ పద్మావతి మహిళా కళాశాలలో రెండు వేదికలపై నిర్వహించనున్నారు. రెండు వేదికలపై ముఖ్య అతిథిగా శాప్ ఛైర్మన్ రవి నాయుడు, ముఖ్య వక్తగా హైదరాబాద్‌కు చెందిన సోను శ్రీనివాస్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల్లో మధ్యాహ్నం 03 గంటలకు ఎస్వీయు విసి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, మహిళా వర్సిటీ విసి ఆచార్య ఉమ, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ, ఆచార్య మురళీధర్ పాల్గొననున్నారు.

రంజాన్ శుభాకాంక్షలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు : రంజాన్ పురస్కరించుకొని పుత్తూరు మున్సిపాలిటీ, గేట్ పుత్తూరులో మజీద్ సాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ కరుణాకర్, నాయకులు గణేష్, అమ్ములు, షణ్ముగ రెడ్డి, అశోక్, సుధ, కృష్ణ కుమార్, దొరస్వామి, హమీద్ బాషా, చాన్, సద్దర్, యూనిష్ సకీల్, ఫజిల్, రసూల్, జాఫర్, రఫీ, జాబీర్, తెలుగు మహిళ మోహన ముస్లింలు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సబ్ స్టేషన్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యుత్ శాఖా ఎస్ఈ సురేంద్ర నాయుడు, డిఈఈ ఆశీర్వాదం, ఏడీఈ శంకరయ్యల ఆదేశాల మేరకు ఈరోజు, రేపు విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి పుత్తూరు అర్బన్, రూరల్ మండలాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఏఈలు జయ్ సాయి, రవి కుమార్‌లు తెలిపారు. ఈ అవకాశంను విద్యుత్ వినియోగదార్లు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జాగ్రత్తలతోనే ఆరోగ్య పరిరక్షణ

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : వేసవికాలంలో తగు జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యా న్ని పరిరక్షించు కోవచ్చని కెసి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మంజునాథ్ తెలిపారు. కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ సహకారంతో వారు ప్రజలకు ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు మాట్లాడుతూ వేసవి కాలం రావడంతో ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండలో బయటకు రావడం తగ్గించాలని, నిత్యం నీళ్లు, కొబ్బరి బొండం, మజ్జిగ, పళ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ చైతన్య కృష్ణ, డాక్టర్ శిల్ప, కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ సలహాదారు డాక్టర్ మహేష్, సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



నిరక్షరాస్యులకు పరీక్షలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

నిరక్షరాస్య నిర్మూలనకు ఉల్లాస్ పరీక్షలు

ప్రజాశక్తి-చౌడేపల్లి: నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వం ఉల్లాస్ పరీక్షలను నిర్వహిస్తోందని వెలుగు ఎపిఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని నిరక్షరాస్యులకు పరీక్షలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 19 పంచాయతీల్లోని 33 కేంద్రాల్లో 365 మంది నిరక్షరాస్యులు పరీక్షలు రాసినట్లు ఆయన వివరించారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మొదటి విడత పూర్తి అయిందని రెండవ విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

ముగిసిన వార్షికోత్సవం

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని మదర్ థెరిసా విద్యాసంస్థలు ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు 24వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్లు ఛైర్మన్ రవీంద్రబాబు తెలిపారు. శనివారం, ఆదివారం వార్షికోత్సవ కార్యక్రమాన్ని ముగించామని ఆయన తెలిపారు. ముఖ్య అతిథిగా మ్మెల్యే అమరనాథరెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఈ కార్యక్రమంలో నాటికలు, సాంఘిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కళాశాల సిబ్బంది పాల్గొనట్లు తెలిపారు.



మాట్లాడుతున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న బాబు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పలమనేరు: మూల పడ్డ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెడుతున్నారని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. పలమనేరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యుల నియోజకవర్గ స్థాయి సమావేశంలో పలమనేరు ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చంద్రబాబు పరిపాలన దక్షతతో రాష్ట్రం ముందుకు సాగుతోందని ఇచ్చిన హామీలు, చెప్పిన అభివృద్ధి తప్పకుండా జరిగి తీరుతుందన్నారు. అయితే అందుకు ఇంకొంత సమయం పడుతుందన్నారు. ఓ వైపు సంక్షేమం... మరోవైపు అభివృద్ధి చేపడుతూ రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నా రన్నారు. దీంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు చాలా మంది ముందుకొస్తున్నారన్నారు. అర్హులైన పేదలను గుర్తించి గృహ నిర్మాణ పథకం ద్వారా దరఖాస్తు చేయించాలని సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆర్వి బాలాజీ, రాంచంద్రనాయుడు, రంగనాథ్, కిషోర్ గౌడ్, ఆనంద్, నాగరాజ్ రెడ్డి, కుట్టి, విజయభాస్కర్ రెడ్డి, బ్రహ్మయ్య, ఖాజా,సుబ్రహ్మణ్యం గౌడ్, గిరిబాబు, నాగరాజు పాల్గొన్నారు...

'అవని' పథకంలో 8.30 శాతం వడ్డీ

డిసిసిబి చీఫ్ మేనేజర్ మహేష్



డిసిసిబి బ్యాంకు మేనేజర్ మహేష్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మహిళల కోసం ప్రవేశపెట్టిన అవని పథకంలో నగదు డిపాజిట్ చేస్తే 8.30 శాతంతో వడ్డీ చెల్లించనున్నట్లు గంగాధర నెల్లూరు డిసిసిబి చీఫ్ మేనేజర్ మహేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన అవని డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారని ఈనెల 31వ తేదీ వరకు అవకాశం వుందని పేర్కొన్నారు. ఒక్కొక్క మహిళ తమ బ్యాంకులో కొత్తగా ప్రవేశపెట్టిన ఈ పథకంలో 333 రోజులకు కనిష్టంగా రూ.10 వేలకు పైబడి డిపాజిట్ స్వీకరించినట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్ మహిళకు రూ 8.40 శాతంతో వడ్డీ చెల్లించ నున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకులో నగదును డిపాజిట్లను చేసే వారికి డిఐసీ జీసీ ఇన్సూరెన్స్ రక్షణ వుందని తెలిపారు.



బోరు ఏర్పాటులో పాల్గొన్న టిడిపి నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారానికే నూతన బోర్లు


ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికే నూతన బోరు బావులు తవ్విస్తున్నట్లు పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ తెలిపారు. వేసవికాలం ప్రారంభమైన వేళ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పట్టణంలో పలుచోట్ల నూతన బోరు బావులు తవ్విస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సహకారంతో ఆదివారం పట్టణ పరిధిలోని శీగలపల్లి ప్రాంతంలో నూతన బోరు బావిని తవ్వించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ రవి, యూనిట్ ఇన్‌ఛార్జ్ ముత్తు, రెండో వార్డ్ బూత్ శ్రీరంగం, పార్టీ అధ్యక్షులు నరసింహులు, కౌన్సిలర్ అభ్యర్థి ఎం రోహిత్ కుమార్, యూత్ లీడర్ నవీన్, సుబ్రమణి, రామచంద్రప్ప, సత్య వేలు, టిఎన్ఎస్ఎఫ్ ప్రశాంత్, జనసేన నాయకులు మంజునాథ్, సత్తి వేలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న టిడిపి నాయకులు చల్లా బాబు

ఇఫ్తార్ విందులో చల్లా బాబు

ప్రజాశక్తి- రొంపిచర్ల: కల్లూరు గ్రామపంచాయతీ దిగవ వీధిలో ఉన్న ఆయేషా మజీసులో ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా పుంగనూరు టిడిపి ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, హిందూ ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఇఫ్తార్ విందులో చల్లా బాబు, ముస్లిం సోదరులు కలిసి ఆప్యాయంగా విందును స్వీకరించి తర్వాత మత పెద్దలతో పలకరించి 'మీకు ఎటువంటి సాయం కావాలన్నా నేనున్నానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు హిందూ ముస్లిం సోదరులు, పులిచెర్ల మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏపీడబ్ల్యూజేఎఫ్ డెయిరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఏపీడబ్ల్యూజేఎఫ్

జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(ఏపీడబ్ల్యూజేఎఫ్) చిత్తూరు జిల్లా శాఖ నాలుగవ మహాసభలు చిత్తూరులో జరుగుతున్న నేపథ్యంలో మహాసభలను విజయవంతం చేయాలని మహాసభలకు హాజరు కావాలని చిత్తూరు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కోరారు. రాష్ట్ర పౌర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే లు గురజాల జగన్మోహన్, పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఈ కార్యక్రమానికి ఆహ్వానించినట్లు తెలిపారు. అనంతరం చిత్తూరు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఏపీడబ్ల్యుజేఎఫ్ డైరీని ఆవిష్కరించారు.

రేపు సమస్యల పరిష్కార వేదిక

విద్యుత్ చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ ఎస్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి -కార్వేటినగరం: మండల కేంద్రంలోని విద్యుత్ ఏడీఈ కార్యాలయ ఆవరణలో ఈ నెల 25వ తేదీ మంగళవారం విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కార వేదిక నిర్వహించ నున్నట్లు విద్యుత్ చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ ఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కార్వేటినగరం ఏడీఈ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశానికి ఛైర్‌పర్సన్ రిటైర్డ్ జెడ్‌పి వి శ్రీనివాసమూర్తి, ఆర్థిక సభ్యులు కే రామమోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ ఆంజనేయులు, స్వతంత్ర సభ్యులు డబ్ల్యూ విజయలక్ష్మి వంటి ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు రాత పూర్వకంగా అందించి పరిష్కరించుకోవచ్చన్నారు.

తల్లికి మించిన దైవం లేదు

- ఆచార్య గార్లపాటి దామోదర్ నాయుడు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం : తల్లికి మించిన దైవం లేదని ఆచార్య గార్లపాటి దామోదర్ నాయుడు అన్నారు. ఆదివారం ఎస్ఆర్ పురం మండలం ఆరిమాకుల పల్లెలో పైనే మునెమ్మ స్మారక పురస్కారాల అవార్డులు అట్టహాసంగా నిర్వహిం చారు. పైనేని తులసినాథం నాయు డు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ తల్లి గొప్పతతనం గురించి వివరించారు. తల్లిని పూజించిన వాడే భార్యపై ప్రేమను చూపిస్తాడని దామోదర్ నాయుడు అన్నారు. మురళి మాట్లాడుతూ తల్లి తొలి గురువని వ్యక్తిత్వం తీర్చిదిద్దడంలో తల్లి పాత్ర విశిష్టమైన అన్నారు. బహుమతులు పొందిన వారితో పాటు పలు వక్తలు తల్లి గొప్పతనాన్ని వివరిం చారు. కథల పోటీలలో కథల అంశాల గురించి మరోసారి చర్చించారు. హైదరాబాద్‌కు చెందిన రోహిణి వంజారికి మొదటి బహుమతి మెమొంటో అందించారు. రెండ వ బహుమతి డాక్టర్ సుగుణ రావు విశాఖపట్నం అందుకోగా, ఓట్ర ప్రకాష్‌రావు తిరుత్తణి, నర్సిరెడ్డి అనంతపూర్, అరుణ కుమారి, విమల చిత్తూరు. సీతారామ రాజు కాకినాడ, కోటేశ్వరరావు కరీంనగర్, సింహ ప్రసాద్, సాదిపల్లి నాగరాజు హైదరాబాద్, మౌని తిరుపతి లకు నగదు పురస్కారాలు , మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షులు పైనేని తులసినాథం నాయుడు, కార్యదర్శి పుష్ప , కోశాధికారి పైనేని మురళి, జొన్నవిత్తుల రామచంద్రమూర్తి, విశ్రాంత ఉపాధ్యాయిని శ్యామలాదేవి, పైనేని విజయేందర్ నాయుడు, బోడపాటి బాలాజీ నాయుడు, కాంతమ్మ, రేణుక పాల్గొన్నారు.



కథల పోటీలో గెలుపొందిన వారితో పైనే మునెమ్మ కుంటుంబ సభ్యులు

మహిళా సంఘ సభ్యులకు ప్రాథమిక విద్య



ప్రజాశక్తి - రామకుప్పం: నిరక్షరాస్యులైన మహిళా సంఘాల సభ్యులకు చదువు నేర్పిస్తున్నామని ఏపిఎం శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. రామకుప్పం మండలం లోని 420 మంది మహిళ సంఘ సభ్యులకు అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, డి ఆర్‌డిఎ వెలుగు వారు సంయుక్తంగా గత 3 నెలలుగా ఉల్లాస్ నవ భారత సాక్షరత కార్యక్రమం ద్వారా ,ప్రాథమిక విద్య నేర్పించామన్నారు. ఈ 420 మంది అభ్యాసకులకు ఆదివారం రామకుప్పం మండలం లో అన్ని పంచాయతీ లలో కలిపి 43 గవర్నమెంట్ పాఠ శాలల్లో ఫౌండేషనల్ లీటరసి నుమరికల్ అసెస్మెంట్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష కు రామకుప్పం మండల ఐసిడియస్ టీచర్స్ , వెలుగు సిసీ లు, వెలుగు, సంఘ మిత్రలు, ఇన్విజిలేటర్స్ గా వ్యవహరించారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

రోడ్డుపైనే దుకాణాలు

- స్పందించని అధికారులు
- నిత్యం రద్దీతో వాహనదారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బంగారుపాళెం మండల కేంద్రంలో చెన్నై -బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా దుకాణదారులు రహదారిని ఆక్రమిస్తున్నారు. దీంతో నిత్య రద్దీగా వుండే ప్రాంతాలలో నిత్యం రద్దీగా వుండడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించకపోవడంతో దుకాణదారులు రోడ్డును పూర్తిగా ఆక్రమిస్తున్నారు. ఈ కారణంగా ఇటు ప్రజలకు, వాహనదారులు పడరాన్ని పాట్లు పడుతున్నారు. వెడల్పు దాదాపు 60 అడుగులు ఉండాల్సిన రోడ్డు 30 అడుగులకు కుంచించుకుపోయింది. నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రంలో రహదారుల్లో దుకాణదారుల వల్ల ఇబ్బందులు తప్పడం లేదన స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పందించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంతో దుకాణదారులు ఇష్టా రాజ్యంగా తయారవుతున్నారు. ప్రతి దుకాణ దారులు 10 నుంచి 15 అడుగులు జాతీయ రహదారి ఆక్రమించుకుంటూ ముందుకు చొరబడి రావడంతో రహదారి గల్లంతయ్యే ప్రమాదం వుందని ఇకనైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి రహదారిని కాపాడాల్సిన బాధ్యత ఉందని ప్రజలు వాహనదారులు మొరపెట్టుకుంటున్నారు



రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులెదుర్కొంటున్న వాహన దారులు